నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, ఆదివారం 16 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL







### ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడడం లేదు..



గ్రామంలో ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడడం లేదు. అతికష్టంపై తెచ్చిన నీళ్లు తాగేందుకు సరిపోవడం లేదు. పశువులను కూడా నీటి సమస్యలు పీడిస్తున్నాయి. మోటర్ సైకిల్‌పై ప్రత్యేక క్యాన్లను ఏర్పాటు చేశాం. ఒక్క క్యాన్ నిండడానికి కనీసం 20 నిమిషాలు పడుతుంది. గంటల తరబడి వేచి ఉంటేనే బోరు బావిలో తిరిగి నీళ్లు వస్తున్నాయి. అధికారులు మా బాధలను పట్టించుకుని నీటి సమస్యను తీర్చాలి. **- కోవ రాము, సాలేగూడ.**



పైపుతో క్యాన్‌లో నీరు నింపుతున్న కోవ రాము

### తాగునీటి కష్టాలతో విముక్తి కల్పించాలి

మాకు తాగునీటి కష్టాల నుంచి విముక్తి కలిగించాలి. ఎడ్లబండ్లపై ట్యాంకులు ఏర్పాటు చేసి దూరంలోని వ్యవసాయ బావుల నుంచి తాగునీళ్లు తీసుకొస్తున్నాం. ఇంటికి బంధువులతోపాటు చుట్టాలు, ఎవ్వరైన వచ్చినా వారికి నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఉంది. మాకు అన్ని బాగున్నా తాగునీటి కష్టాలు మాత్రం తీర్చడం లేదు. నీటి కోసం ప్రత్యేకంగా ఒకరిని పెట్టాలని కోరుతున్నా.

**- గేడం మల్కు, సాలేగూడ, ఇంద్రవెల్లి.**



మోటర్ సైకిల్‌పై నీటి క్యాన్లను సాలేగూడకు తీసుకెళ్తూ..



ట్యాంకుల్లోని నీటిని తీసుకుంటున్న ఆదివాసీ మహిళల



అలంకర ప్రాయంగా మారిన మిషన్ భగీరథ నీటి ట్యాంక్



విద్యుత్ మోటర్ వద్ద ట్యాంకుల్లో నీళ్లు నింపేందుకు వేచిచుస్తున్న ఆదివాసీ గిరిజన యువకుడు

# వేసవికి ముందే దాహం కేక

## సాలేగూడ ఆదివాసులను పీడిస్తున్న నీటి కష్టాలు

### ఇంటింటికీ ఎడ్లబండిపై ట్యాంకులు

**ఆదిలాబాద్ ఏజెన్సీలో** వేసవికి ముందే నీటి కష్టాలు మొదలయ్యాయి. ఆదివాసులు బిందెడు నీటి కోసం కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నారు. ఇంద్రవెల్లి మండలంలోని తేజాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సాలేగూడలో 130 ఉమ్మడి కుటుంబాలు ఉండగా 400లపై చిలుకు జనాబా ఉంది. గతంలో అధికారులు ఓ వ్యవసాయ భూమిలో బోరుబావి ఏర్పాటు చేయగా.. అప్పటి నుంచి ఆదివాసులు ఆ నీటినే తాగుతున్నారు. దాహార్తిని తీర్చేందుకు అధికారులు, కొందరు గ్రామస్తులు కలిసి గ్రామంతోపాటు చుట్టు పక్కల దాదాపు 11బోర్లు వేసినా నీళ్లు పడలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో బోర్లు అడుగంటిపోవడంతో తాగునీటి కష్టాలు తీవ్రంగా ఉన్నాయని ఆదివాసీలు వాపోయారు. - ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 15

### ఇంటింటా ఎడ్లబండిపై డ్రమ్

గ్రామంలో తాగునీటి కష్టాలు మొదలు కావడంతో ఆదివాసులు ప్రతి ఇంటికి ఎడ్లబండ్లపై డ్రమ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు మోటర్ సైకిల్‌పై క్యాన్లతో తాగునీరు తీసుకొస్తున్నారు. తాగునీటి కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంట్లోని ఒకరూ తప్పకుండా ఉండాల్సిన పరిస్థితి ఉంది. వేకువ జామున బిందెలు, క్యాన్లు, ట్యాంకులు ఏర్పాటు చేసిన ఎడ్లబండ్లలో గ్రామానికి కిలో మీటర్ల దూరంలోని బోరు బావికి వెళ్లి గంటల కొద్ది తాగనీటి కోసం వేచి చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిందెడు నీళ్ల కూడా దొరకడం లేదని వాపోయారు.



---



సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

## సేవాలాల్ కృషిని ఆదర్శంగా తీసుకుందాం

**బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్**

నేరడిగొండ, ఫిబ్రవరి 15 : ధర్మ సమాజ రక్షణ కోసం సేవాలాల్ మహారాజ్ కృషిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సేవాలాల్ జయంతికి హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో ప్రయాణించి, బంజారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం అని తెలిపారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు కరణ్‌సింగ్, జాదవ్ మహేందర్, బాబులాల్, సురేందర్, లింబాజీ, అంబాజీ, రాథోడ్ రాజశేఖర్, సందీప్ పాల్గొన్నారు.

## యూరియా కోసం ఎగబడ్డ రైతులు



యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

**దస్తురాబాద్ మండల** కేంద్రంలోని పీఏసీఎస్‌లో శనివారం యూరియా కోసం రైతులు బారులుదీరారు. యాసంగి నాట్లు వేసిన తర్వాత యూరియా అవసరం కావడంతో ఒక్కసారిగా ఎగబడ్డారు. పీఏసీఎస్ పరిధిలో 4111 మంది రైతులు ఉండగా వీరందరూ ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, ద్విచక్రవాహనాలపై వచ్చారు. వీరికి 60 టన్నుల యూరియా అవసరం. కానీ.. 30 టన్నులే రావడంతో రైతులు ఒక్కసారిగా తరలివచ్చారు. బారులుదీరి గంటల తరబడి నిరీక్షించారు. యూరియా బస్తాలు మరిన్ని అందుబాటులో ఉంచాలని రైతులు డిమండ్ చేస్తున్నారు. - దస్తురాబాద్, ఫిబ్రవరి 15

# ప్రైవేటుకే పత్తి అమ్మకాలు

**● ప్రారంభంకాని సీసీఐ కొనుగోళ్లు ● నష్టపోతున్న రైతులు**

ఆదిలాబాద్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కేంద్ర ప్రభు త్వం రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇం డియా(సీసీఐ) కొనుగోళ్లు నిలిచిపోవడంతో మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోళ్లు జరగడం లేదు. సీసీఐ సర్వర్ సమస్య కారణంగా కొనుగోళ్లు జరగడం లేదని అధికారులు అంటున్నారు. ఒకటి, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి పత్తి కొనుగోళ్లు జరపాల్సిన సీసీఐ అధికారులు ఈ దిశగా చొరవ తీసుకోవడం లేదని రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్ల విషయంలో సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు పంటను విక్రయించి నష్టపోతున్నారు.



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులు ప్రైవేటు వ్యాపారులకు పత్తిని విక్రయిస్తున్న రైతులు

### క్వింటాల్‌కు రూ.500 నష్టం

సీసీఐ క్వింటాలుకు రూ.7421తో పత్తిని కొనుగోలు చేస్తున్నది. ప్రైవేటులో ధర తక్కువగా ఉండడంతో రైతులు సీసీఐకి విక్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7521 ఉండగా, పత్తి నాణ్యత సరిగా లేదంటూ సీసీఐ రూ.100 తగ్గించి రూ.7421 చొప్పున కొనుగోలు చేస్తున్నది. ఐదు రోజులుగా సీసీఐ కొనుగోళ్లు పూర్తిగా నిలిపిపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్మాల్సిన దుస్థితి నెలకున్నది. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.6910 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు క్వింటాలుకు రూ.511 నష్టపోతున్నారు. సీసీఐ కొనుగోళ్లు నిలిచిపోవడంతో ఇదే అవకాశంగా భావించిన ప్రైవేటు వ్యాపారులు అధికంగా పంటను కొనుగోలు చేస్తున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో దళారులు అధిక సంఖ్యలో ఉంటూ పత్తిని తమకు అమ్మాలని రైతులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లను ప్రారంభించి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## రికార్డులను భద్రంగా ఉంచడానికే డిజిటలైజేషన్



డిజిటలైజేషన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : కోర్టులోని కేసుల రికార్డులను భద్రంగా ఉంచడానికి సుప్రీం ఆదేశాల మేరకు డిజిటలైజేషన్ చేస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన డిజిటలైజేషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించి సూచనలు చేశారు. ప్రభాకర్‌రావు మా ట్లాడుతూ.. కోర్టులో రికార్డులను భద్రంగా ఉంచేందుకు డిజిటలైజేషన్ చేస్తున్నామన్నారు. ఇ ప్పటివరకు మ్యాన్యువల్‌గా ఉన్న రికార్డులను కంప్యూటీకరిస్తు వాటిని భద్రపరుస్తున్నామన్నారు. ఇతర జిల్లాల్లో డిజిటలైజేషన్ కేంద్రాలకు భవనాలు లేవని, ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ వారు భవనాన్ని ఇవ్వడం సంతోషకరమన్నారు.

**లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి**

కోర్టు హాలులో పెండింగ్ కేసులపై జిల్లా జడ్జి సమీక్షించారు. పోలీసు స్టేషన్లు, కోర్టులవారీగా పెండింగ్ కేసులు, ఎన్బీడబ్ల్యూ, ట్రయల్స్ వంటి వాటి గురించి చర్చించి పోలీసులకు సూచనలు చేశా రు. స్టేషన్ పరిధిలో కేసులు పెండింగ్ లో లేకుండా చూడాలని సూచించారు. అదే విధంగా మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధికంగా రాజీ పడదగ్గ కేసులను పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. న్యాయమూర్తులు ప్రమీల జైన్, సౌజన్య, అదనపు ఎస్పీ సురేందర్‌రావు, అదనపు క లెక్టర్ శ్యామలదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, నాగేందర్, పోలీసులు పాల్గొన్నారు.

**ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి**

న్యాయవ్యవస్థలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో శనివారం కోర్టులో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభాకర్‌రావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. తొలుత ఆయన వైద్య పరీక్షలు చేసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ప్రమీలజైన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి. సౌజన్య, డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన, డీటీసీవో సుమలత, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేశ్, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

## ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశానిర్దేశం

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : ఈ నెల 27వ తేదీన నిర్వహించే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి శనివారం జడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి కలెక్టర్ ము ఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రా రంభించి పలు సూచనలు చేశారు. ఈ సం దర్భంగా పోలింగ్ డే సందర్భంగా పీవోలు, ఏపీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ ట్రె యినర్లు రాజేశ్వర్, జగన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రెండో విడుత శిక్షణ తరగతులు ఈ నెల 21వ తేదీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో రామిరెడ్డి, సూపరింటెండెంట్ పంచపూల పాల్గొన్నారు.

**పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్**

గురుకుల డిగ్రీ కళాశాల అడ్మిషన్ పోస్టర్‌ను కలెక్టర్ రాజర్షి షా శనివారం ఆయన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని, త్వరగా అభ్యర్థులు కళాశాలను సందర్శించి తమ అడ్మిషన్‌ను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివకృష్ణ, సిబ్బంది రామకృష్ణ, విఠల్, రాజేశ్, సురేందర్, ప్రితమ్, రమేశ్ పాల్గొన్నారు.

**ఈవీఎం గోదాం తనిఖీ**

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల తనిఖీలో భాగంగా శనివారం స్థానిక శాంతినగర్ ఈవీఎం గోదాంను కలెక్టర్ రాజర్షి షా తనిఖీ చేశారు .ఈ సందర్భంగా గోదాం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. కలెక్టర్ వెంట సూపరింటెండెంట్ పంచపూల, సిబ్బంది దేవరాజ్ ఉన్నారు.



కంప్యూటర్లను అందజేస్తున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

## సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

**పోలీస్ స్టేషన్‌లకు కంప్యూటర్లను అందజేసిన ఎస్పీ**

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 15 : పోలీసు అధికారులు నేర శోధన, కేసుల సత్వర పరిష్కారానికి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అన్ని పోలీస్ స్టేషన్లకు కంప్యూటర్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, అవినాశ్ కుమార్, రాజేశ్ మీన, తదితరులు పాల్గొన్నారు.